ప్రజాశక్తి
శుక్రవారం 26 జనవరి 2024 5
శ్రీ సత్యసాయి






సీనియర్ ఓటరును సత్కరిస్తున్న కలెక్టర్ అరుణబాబు

బిల్లులు.. వచ్చేలా లేవు...!

◆ చేసిన పనులకు చెల్లింపులు చేయండి మహాప్రభో..!
◆ ఎన్నికల్లో గట్టెక్కుతామని వేడుకోలు
◆ అధికారులు, ప్రభుత్వ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు
◆ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి మొర



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'ఎన్నికలొచ్చాయి.. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి... ఇస్తే ఎన్నికల సమయంలో ఖర్చులకైనా వస్తాయి... బిల్లులు చెల్లించండి మహా ప్రభో'.. అంటూ ముఖ్య ప్రజాప్రతినిధులే ఫైళ్లు పట్టుకుని ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా పర్యటన వచ్చిన సందర్భంగానూ కొంత మంది ఎమ్మెల్యేలు బిల్లులివ్వమని అడగటం గమనార్హం. ఇప్పుడు రాకపోతే ఎన్నికల అనంతరం పరిస్థితి ఏ రకంగా ఉంటుందోనన్న గుబులు పనులు చేసిన నాయకుల్లో నెలకొంది. వైసిపి అధికారంలోకి వచ్చాక చాలా కాలం పనులు ముందుకు నడవలేదు. ప్రధానంగా 2019 ఎన్నికలకు ముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పనులు చేశారు. అయితే 2019 ఎన్నికల అనంతరం టిడిపి కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులను నిలిపివేసి ఉన్నారు. ఇప్పటికి వారి బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆ తరువాత వైసిపి ప్రభుత్వ హయాంలో రహదారులు, సచివాలయాలు, విలేజ్ క్లీనిక్‌లను, రైతు భరోసా కేంద్రాలు ఇలా వివిధ రకాల పనులను వైసిపి నాయకులు, కార్యకర్తలు చేశారు. రహదారులు వంటి పెద్ద పనులైతే నేరుగా ప్రజాప్రతినిధులే చేశారు. వీటి బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఒకటి, రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ కూడా రానుంది. నోటిఫికేషన్ వచ్చాక బిల్లులు చెల్లింపులు దాదాపుగా నిలిచిపోతాయి. ఆ తరవాత ప్రభుత్వంలో ఏదైనా మార్పులు, చేర్పులు జరిగితే బిల్లుల పరిస్థితి ఏమిటన్న గుబులు ఇప్పుడు వైసిపి నేతల్లో నెలకొంది. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఎమ్మెల్యేలపైనా ఒత్తిడి పెంచుతున్నారు. వెంటనే బిల్లులు మంజూరు చేయించాలని కోరుతున్నారు. దీంతో ఎమ్మెల్యేలే నేరుగా రంగంలోకి దిగుతున్నారు. బిల్లులు చెల్లించాలని అధికారులతోపాటు మంత్రులు, ఇతర ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పుట్టపర్తికి విచ్చేసిన సందర్భంగానూ ఇద్దరు ప్రజాప్రతినిధులు కలసి రూ.ఎనిమిది కోట్లు, రూ.50కోట్ల బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అదే విధంగా మరో ఎమ్మెల్యే తాను కాంట్రాక్టు చేస్తున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల కోసం తిరుగుతూనే ఉన్నారు. టిక్కెట్టు దక్కిని మరో ప్రజాప్రతినిధికి సంబంధించి కూడా బిల్లులు పెద్దఎత్తునే పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. మొత్తంగా వైసిపి నాయకులు, కార్యకర్తల్లో బిల్లుల గుబులు నెలకొంది. కోట్లు ఖర్చు పెట్టాం. ఇప్పుడు ఆ బిల్లులు రాకపోతే తరువాత పరిస్థితి ఏమిటన్న గుబులు వారిలో కనిపిస్తోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు డబ్బులు వెనకేసుకుందామంటే ఈ రకంగా బుక్ అవుతున్నామోనని భయడుతున్నారు. వీరి గుబులు చూసి ఎమ్మెల్యేల్లోనూ ఆందోళన నెలకొంది. కార్యకర్తలు తమను నమ్మి పనులు చేశారు. ఇప్పుడు రాకుండాపోతే వారు పూర్తిస్థాయిలో నష్టపోతే తరువాత వారిచేత ఎన్నికల్లో ఏ రకంగా పని చేయించుకోగలమని దిగులు చెందుతున్నారు.

ఓటు వజ్రాయుధం

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, 18 సంవత్సరాలు పై బడిన అందరూ ఓటు హక్కు పొంది వంద శాతం ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు పేర్కొన్నారు. పుట్టపర్తి మండల పరిధిలోని ఎనుములపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14వ జాతీయ ఓట దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు అన్నింటి కంటే ముఖ్య మైనది ఓటు హక్కున్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటరుఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కులం,మతం,డబ్బులు చూడకుండా వంద శాతం ఓట్లు వేయాలన్నారు. జిల్లాలో గత సార్వత్రిక ఎన్నికలలో 82 శాతం మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఈ సారి వందశాతం వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియను రాబోయే సార్వత్రిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ సారి కొత్తగా జిల్లాలో సుమారు 30 వేల మంది యువత ఓటర్లుగా నమోదు చేసుకున్నారన్నారు. ఇంకా ఎవరైనా ఓటుకు నమోదు చేసుకోకుంటే వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారితో ఓటు ప్రతిజ్ఞ చేయించారు. చాలా ఏళ్లుగా ఓటు హక్కును వినియోగించుకుంటున్న సీనియర్ సిటిజన్స్ జె.నారాయణప్ప, పి.వెంకటరాముడులను కలెక్టర్ సన్మానించారు. ఓటరుగా కొత్తగా నమోదైన యువ ఓటర్లకు ఎపిక్ కార్డులు అందజేశారు. ఓటరు జాబితాకు కషిచేసిన బిఎల్వోలు, సూపర్వైజర్లు, వీఆర్వోలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డివో భాగ్యరేఖ, స్వీప్ అధికారి శివ రంగప్రసాద్, తహశీల్దార్ నవీన్ కుమార్, కలెక్టర్ కార్యాలయం ఎన్నికల అధికారి మైనావుద్దీన్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ వేడుకలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



రిహార్సల్స్‌లో పాల్గొన్న ఎస్పీ మాధవరెడ్డి

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నాడు నిర్వహించే గణతంత్ర వేడుకలకు నిర్వహణకు అధికారులు ఏర్పాట్లను సర్వం సిద్ధం చేశారు. గురువారం నాడు పరేడ్ గ్రౌండ్‌ను ఎస్పీ మాధవరెడ్డితో పాటు అదనపు ఎస్పీ విష్ణు తదితర అధికారులు పరిశీలించారు. ఇప్పటికే ఆయా శాఖల్లో అమలు చేసిన ప్రగతి పథకాల శకటాలను అధికారులు తయారు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడానికి పలు పాఠశాల విద్యార్థులు సిద్ధం అయ్యారు. ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభం అయ్యేవిధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఆర్ఐలు టైటాస్, రాజశేఖర్ రెడ్డి, నారాయణ, పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్



కార్యక్రమంలో పాల్గొన్న జడ్జిలు, ఎస్ఐలు

పెనుకొండ : పెనుకొండ కోర్టులో మార్చి 9వ తేదీ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు లోక్ అదాలత్ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.శంకర్రావు తెలిపారు. లోక్ అదాలత్‌లో బ్యాంకు, కాంపౌండ్ డబుల్ క్రిమినల్, సెక్షన్ 138 ఎన్ఐ యాక్ట్, మెయింటెనెన్స్, సివిల్ కేసులు, పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జితో పాటు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నీలకంఠాపురంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

మడకశిర : మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో గురువారం సర్వోదయ జూనియర్ కళాశాల ఆధ్వర్యం లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ముందుగా స్థానిక నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో పరిసరాలను శుభ్రం చేశారు. ముఖ్యఅతిథిగా రఘువీరారెడ్డి భార్య సునీత హాజరయ్యారు. కరస్పాండెం ట్ ఆదినారాయణ, దివిత్ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేయడం ద్వారా దేవాలయం తేరువీధిని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శుభ్రం చేశారన్నారు. కార్యక్ర మంలో సర్వోదయ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ పరమేశ్వర, అధ్యాపకుడు హరీష్, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గోరంట్ల రూరల్ : మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో గురువారం వానవోలు గ్రామవాసి హైదరాబాద్‌లో స్థిరపడిన పిఎంఆర్ కాంట్రాక్టర్ బి.సోమశేఖర్ పదో తరగతి విద్యార్థులకు రూ. 50 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను స్థానిక వైసిపి సీనియర్ నాయకులు చేత పంపిణీ చేయించారు. స్టడీ మెటీరియల్‌ను మల్లెల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రవిచంద్ర తయారు చేశారు. స్టడీ మెటీరియల్ వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి సూర్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖోఖోలో జిల్లా స్థాయికి ఎంపిక

ప్రజాశక్తి-రొద్దం

పుట్టపర్తిలో గురువారం జరిగిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. రొద్దం మండలంలోని అన్ని సచివాలయాల నుంచి పాల్గొన్న జట్లలో కలిపి సచివాలయ బాలికలు, బాలుర జట్లు విజేతగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, మోహన్, మనోజ్‌రెడ్డి, పిఇటిలు మహేష్, రమేష్, అనురాధ పాల్గొన్నారు.

క్రికెట్‌లో మనూరు జట్టు విజయం

మడకశిర : 'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలో మనూరు సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. సచివాలయం సిబ్బంది వివిధ ఆటల పోటీలు నిర్వహించారు.

ఓటు హక్కుపై అవగాహన

లేపాక్షి : ఓటు హక్కు వినియోగంపై గురువారం తహశీల్దార్ కాటంబాబు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు కార్యాలయ సిబ్బంది, బిఎల్ఒలు, ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ దేశ తలరాతను మార్చే శక్తి ఓటుకు ఉందని, కావున ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం ద్వారా దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కుమార్‌రెడ్డి, ఆర్ఐ ప్రమీలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న తహశీల్దార్ కాటంబాబు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న పయ్యావుల కేశవ్



చంద్రబాబు పర్యటనను విజయవంతం చేద్దాం

◆ పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్ ◆ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ


ఈనెల 27వ తేదీన ఉరవకొండలో టిడిపి అధినేత, మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేసేలా టిడిపి శ్రేణులు పని చేయాలని ఎమ్మెల్యే, పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. చంద్రబాబు పర్యటనకు సంబంధించి ఉరవకొండ పట్టణంలోని అనంతపురం బైపాస్ రోడ్డు భారత్ పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాట్లను టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. సభాస్థలితోపాటు హెలిప్యాడ్ పనులను ప్రత్యక్షంగా పాల్గొని పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పార్లమెంట్ పరిధిలో లక్ష మందితో రా కదలిరా అనే కార్యక్రమాన్ని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు తెలిపారు. రా కదిలిరా కార్యక్రమం పార్టీ శ్రేణులకు నూతనోత్తేజాన్ని ఇస్తోందన్నారు. అన్ని గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఉరవకొండలో జరిగే రాకదిలిరా కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దముష్టూరు సర్పంచి బోస్, ఇంద్రావతి మాజీ సర్పంచి వెంకటేశులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో నేడు 'జయహో బిసి'

మడకశిర : పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో శుక్రవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో 'జయహో బిసి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ కన్వీనర్ మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం 10 గంటలకు టిడిపి కండువా, జెండా ధరించి పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి భారీ బైక్ ర్యాలీగా యాదవ కళ్యాణమండపం చేరుకుంటామన్నారు. కావున టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

చరణ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం


గోరంట్ల రూరల్ : 'ఆత్మీయ పలకరింపు' కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని వెంకటరమణపల్లి పంచాయతీలోని శెట్టిచిన్నంపల్లి, నల్లన్నపల్లి, వెంకటరమణపల్లి, పెరుమాలపల్లి గ్రామాల్లో పెనుకొండ నియోజక వర్గ సమన్వయకర్త, మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లో స్థానిక వైసిపి నాయకులు చరణ్ రెడ్డికి శాలువాలు, పూలమాలలు వేసి బాణసంచా పేల్చి ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశారని, రాబోయే ఎన్నికల్లో వైసిపిని ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి అశ్వర్థరెడ్డి, నాయకులు ఉమాశంకర్‌రెడ్డి, సంపత్, వైస్ ఎంపిపి నాగభూషణ్‌రెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్‌రెడ్డి, నార్సింపల్లి శివారెడ్డి, హరినాథ్ రెడ్డి, ఉప సర్పంచి రాజారెడ్డి, గంపల రమణారెడ్డి, పోతుల రామకృష్ణారెడ్డి, శివమణి, కాంగారెడ్డిపల్లి గోవిందరెడ్డి, చౌరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, నాగరాజు, సాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.



చరణ్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్న వైసిపి శ్రేణులు

'వైఎస్ఆర్ ఆసరా' మహిళలకు వరం

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



చెన్నేకొత్తపల్లిలో వైఎస్ఆర్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మహిళా సాధికారత కోసం సిఎం జగన ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ ఆసరా' అక్కచెల్లెమ్మలకు వరం అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో 20 లక్షల మంది డ్వాక్రా గ్రూపుల రుణాలను సిఎం జగన్ చెల్లిస్తున్నాడన్నారు. చెన్నేకొత్తపల్లి, నాగసముద్రం, కుంటిమద్ది, గంతిమర్రి, పోలేపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన 'వైఎస్ఆర్ ఆసరా' కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. చెన్నేకొత్తపల్లి మండల వ్యాప్తంగా 9,291 మంది పొదుపు సంఘాలకు సిఎం జగన్ 'వైఎస్సార్ ఆసరా' పథకం కింద నాల్గో విడతలో రూ. 8,94,62,284, మొత్తం నాలుగు విడతల్లో రూ. 35,78,70,620 ఇచ్చారన్నా రు. రామగిరి మండలా నికి వివిధ పథకాల ద్వారా రూ. 271 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. జగన్ అనే బలమైన శక్తి మీ వెనుక ఉంది కాబట్టే బ్యాంకర్లు ధైర్యం గా రుణాలిస్తున్నారన్నారు. పరిటాల రవీంద్ర, సునీత 25 ఏళ్లు అధికారంలో ఉన్నా వారి సొంత మండ లం రామగిరికి 400 ఇళ్లు తీసుకురాలేదని, నేను 4,500 ఇళ్లు తీసుకొచ్చానన్నారు. వారు గ్రామాల్లో వర్గాలుగా విడదీసి తగువులు పెట్టారు. నేడు ఆయా గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం తప్ప ఇతర సమస్యలేవీ లేవన్నారు. అనంతరం కుంటిమద్ది గ్రామంలో 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గంతిమర్రి ఎంపియుపి పాఠశాల విద్యార్థులకు పెన్నులు, అట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, వైసిపి మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వైసిపి విజయాన్ని ఆపలేరు

నియోజకవర్గ స్థాయి సమావేశంలో నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ పరిశీలకులు అశోక్ కుమార్

ప్రజాశక్తి-మడకశిర

వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయాన్ని ఎవరూ ఆపలేరని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు, టిటిడి బోర్డు మెంబర్ పోకుల అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఆర్అండ్‌బి విశ్రాంతి భవనం ఆవరణలో గురువారం నియోజకవర్గ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అశోక్ కుమార్, మాజీ మంత్రి హెచ్‌బి నరసేగౌడ్, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, మడకశిర నియోజక వర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరయ్యారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎపిసిసి అధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన షర్మిల కేవలం అక్కసుతో సిఎం జగన్‌పై విమర్శలు చేస్తుందన్నారు. ఎపిలో కనుమరు గైన కాంగ్రెస్ పార్టీకి ఆమె చేసేదేముందని ప్రశ్నించారు. సినిమా రంగం కానీ, చంద్రబాబు కానీ వైసిపిని ఏమీ చేయలేరన్నారు. జగన్ అమలు చేసి న సంక్షేమ పథకాల తో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వైసిపి విజయానికి కృషి చేస్తారన్నారు. నరసేగౌడ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఈరలక్కప్ప, ఎంపిగా శాంతమ్మ భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వక్కలిగ సంఘం రాష్ట్ర ఛైర్మన్ నళిని రంగయ్య గౌడ్, సంయుక్త రాష్ట్ర కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, శివకుమార్, అమరాపురం సర్పంచి వాగేష్, గుడిబండ జడ్పిటిసి భూతరాజు, రొళ్ల ఎంపిపి కవితావిజయరంగేగౌడ్, శివప్రసాద్, పట్టణ అధ్యక్షుడు పుట్ట కామప్ప, అగలి కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గర్భిణులకు అన్నదానం చేస్తున్న సవితమ్మ

గర్భిణులకు సవితమ్మ అన్నదానం

రొద్దం : స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వైద్య సేవల కోసం వచ్చే గర్భిణులకు గురువారం ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. 15 నెలలుగా అన్నదానం చేస్తున్న టిడిపి రాష్ట కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ స్వయంగా వడ్డించారు. వివిధ గ్రామాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా పౌష్టికాహారం అందిస్తున్నారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, ఆంజనేయులు, తాడంగిపల్లి రంగన్న, తిరుపాల్‌నాయుడు, క్రిష్టప్ప, జయరాం, చెన్నకేశవులు, మంజునాథ్, ఈరప్ప, లింగప్ప, సిద్దన్నబాబు, కదిరప్ప, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే బిసిల అభివృద్ధి

గుడిబండ : బిసిలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది టిడిపినే అని మడకశిర నియోజకవర్గ పోల్ మేనేజర్ డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి పేర్కొన్నారు. గుడిబండలో గురువారం జయహో బిసి కార్యక్రమం నిర్వహించా రు. ఆయన మాట్లాడుతూ టిడిపి పాలనలో బిసిలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసి వారిని ఆదుకున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. జగన్ ప్రభుత్వం బిసిలకు తీవ్ర అన్యాయం చేసిందని, బిసిలను అణగదొక్కడానికి కంకణం కట్టుకొని పాలన సాగించిందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దన కుంటప్ప, దుర్గేష్, శివకుమార్, మంజునాథ్, బూదిపల్లి జయరాం, లక్ష్మీనరసప్ప, భీమరాజు, జనార్ధన్, రాజేంద్ర, పురుషోత్తం, భోజరాజు, బాదిపల్లెప్ప, లక్ష్మీనారాయణ, నారాయణ, కృష్ణమూర్తి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మడకశిర : పట్టణంలో ఎస్ఐగా పనిచేసిన శేషగిరి సిఐగా ఉద్యోగోన్నతి పొందిన సందర్భంగా గురువారం మండల పరిధిలోని అమిదాలగొంది గ్రామంలోని వేంకటేశ్వర వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. మడకశిర ఎస్ఐగా నిజాయితీగా సేవలందించి ప్రజల మనస్సులో చెరగని ముద్ర వేసిన శేషగిరి స్థానిక ముస్లింల ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కార్పెంటర్స్ బాబా, పిసి మసూద్‌వలి, మెకానిక్ దాదు, నశ్రీన్ ఆశ్రమ వ్యవస్థాపకులు తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

టిడిపి నేత మృతికి మాజీ ఎమ్మెల్యే సంతాపం

మడకశిర : మండల పరిధిలోని హరేసముద్రం గ్రామానికి చెందిన టిడిపి యువ నేత ప్రభాకర్ తండ్రి గురువారం మృతిచెందాడు. విషయం తెలియగానే మాజీ ఎమ్మెల్యే కె.ఈరన్న, వారి ఇంటికెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈరన్న వెంట నాయకులు అశ్వత్తమప్ప, రామాంజ నేయులు, అశ్వత్తనారాయణ, నరసింహమూర్తి ఉన్నారు.

కర్పూరీ ఠాకూర్‌కు నివాళి

మడకశిర : పట్టణంలోని బాలాజీ నగర్ టిడిపి కార్యాలయంలో బీహార్ ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు పని చేసిన నాయీ బ్రాహ్మణుల ఆరాధ్య దైవం, భారతరత్న అవార్డు గ్రహీత కర్పూరి ఠాకూర్ జయంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయీబ్రాహ్మణ జిల్లా సాధికార అధ్యక్షుడు రామాంజనేయులు, పట్టణ కన్వీనర్ మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, టిడిపి, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

బత్తలపల్లి : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలను డిఎస్ఆర్(డాక్టర్ సుధాకర్ గ్రూప్స్) ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో డిఎస్ఆర్ గ్రూప్స్ ఎమ్‌డీ డాక్టర్ టి.సుధాకర్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. విజేతలకు శుక్రవారం బహుమతులను ప్రధానం చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ రాజశేఖర్, మార్కెటింగ్ ఆఫీసర్ హర్షవర్ధన్, సేల్స్ ఆఫీసర్ దివాకర్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

తనకల్లు : వైసిపి హయాంలోనే ప్రజాసంక్షేమం సాధ్యమని ఆపార్టీ నాయకులు అన్నారు. మండల పరిధిలోని చీకటిమనిపల్లిలో వైసీపీ సీనియర్ నేత బైక్ భాస్కరెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో వైసిపి కదిరి సమన్వయకర్త మాగ్బుల్ అహ్మద్, పిఇసి సభ్యులు పూల శ్రీనివాసులు రెడ్డి. వైసిపి సీనియర్ నాయకులు వజ్ర భాస్కర్ రెడ్డి, లింగాల లోకేశ్వర్ రెడ్డి అధ్వర్యంలో సుమారు 40కుటుంబాలు వైసీపీలో చేరాయి. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలుపరుస్తున్న ఏకైక పార్టీ వైసిపినే అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరుసు నిర్వహణకు చేయూత

కదిరి టౌన్ : తలుపుల మండల కేంద్రంలో జరుగు తలుపుల బాబా షర్ఫుద్దీన్ ఉరుసు నిర్వహణకు వైసిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ చేయూతను అందించారు. తనవంతు సాయంగా రూ. 15వేలను బాబా షర్ఫుద్దీన్ దర్గా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులతో పాటు ఎంపీపీ రఫిక్ నాయక్, నూతన కాలవ సర్పంచి షేక్షావలి, ఇమాంసాబ్, నాగూర్, బాబ్జాన్, సలీం, పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పివిఎస్ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పివిఎస్ పాఠశాల చైర్మన్ నాయుడు, ఎంఇఒ రమణప్ప. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శవంతులను స్ఫూర్తిగా తీసుకోవాలి

హిందూపురం : విద్యార్థులు ఆదర్శవంతుల జీవిత చరిత్రలను చదివి, వారిని స్ఫూర్తిగా తీసుకుని సేవా భావంతో ముందుకు సాగాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సూచించారు. ఎస్కెయు సౌజన్యంతో బాలయేసు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో కొత్త కాపుల పల్లి గ్రామంలో జరిగిన ప్రత్యేక శిబిరాన్ని బలరామిరెడ్డి గురువారం ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్. జియావుల్లా అధ్యక్షత జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బలరామిరెడ్డి మాట్లాడుతూసేవా మార్గాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఏడు రోజులు గ్రామంలో సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసోసియేట్ గవర్నర్ తిమ్మారెడ్డి, గ్రామ పెద్దలు చంద్రశేఖర రెడ్డి, రామాంజనేయ రెడ్డి, పోగ్రాం అధికారి హరీష్, అశ్వర్థ నారాయణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

15లోపు ఈ క్రాప్‌బుకింగ్ పూర్తి చేయాలి

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలోని రైతులందరూ ఫిబ్రవరి 15 లోగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ఆవుటాల రమణారెడ్డి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, సంబంధిత వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలను వివరించారు. ఇప్పటివరకు రబీలో ఈ క్రాప్ బుకింగ్ 93 శాతం పూర్తి చేసామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమ శాఖ జెడి పద్మమ్మ, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, విద్యుత్, సహకార, బ్యాంకింగ్, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖల అధికారులు, ఇరిగేషన్ శాఖల అధికారులతో పాటు మార్క్‌ఫెడ్, సీడ్స్ శాఖల అధికారులు. కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కాగృహాలు మంజూరు చేయాలి


తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా సొంత ఇళ్లు లేని వారందరికి ఇంటి స్థలంతో పాటు గృహాలను మంజూరు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు జెడ్‌పి శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేస్తు సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో వందలాది మంది లబ్దిదారులతో కలిసి పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మూడేళ్ల కిందట ఎంపిక చేసిన వారితో పాటు కొత్తగా సచివాలయ ఉద్యోగులతో సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం, ఇళ్లను మంజూరు చేయాలన్నారు. లేని పక్షంలో భూపోరాటం చేసి, ప్రభుత్వ స్థలాలను పేదలకు పంచుతామని హెచ్చరించారు. అనంతరం ఇంటి దరఖాస్తులతో పాటు వినతిని తహశీల్దార్ స్వర్ణలతకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, సిఐటియు నాయకులు బాబా, కెవిపిఎస్ జ్యోతమ్మ, నారాయణ, రాయుడు, గోవిందప్ప, భాస్కర్, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ప్రధాన కార్యదర్శి విమల కుమారి, నసీం తాజ్, సహాయ కార్యదర్శి సరస్వతి, కోశాధికారి గంగాధర్, నరసింహులుతో పాటు పెద్ద ఎత్తున పేదలు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయండి


విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

జిల్లా కేంద్రంలో ఈనెల 26వ తేదీన జరిగే బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, రైతు రుణాలను మాఫీ చేయాలని, కేరళ ప్రభుత్వ తరహాలో విముక్తి చట్టాన్ని తీసుకొని రావాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు పూర్తి అయిన ప్రతి రైతుకు పదివేల రూపాయలు పింఛను ఇవ్వాలని, రైతుల మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించ రాదని, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు వెంటనే అమలు చేయాలని, పోలవరం ప్రాజెక్టు నిధులు కేటాయించాలని కోరారు. ఉపాధి హామీ పథకం కోసం రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈసమస్యలపై నిర్వహించే బైక్‌ర్యాలీకి రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జెవి రమణ, ఏ. మారుతితో పాటు నాయకులు ఎస్‌హెచ్ బాషా, ఎల్ ఆదినారాయణ, టీ అయూబ్ ఖాన్, వెంకటనారాయణ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి ధర్మవరం టౌన్


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

శ్రీసత్యసాయి జిల్లా నుంచి జాతీయస్థాయి యోగాపోటీలకు 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు యోగా ఆసోషియేషన్ జిల్లా అధ్యక్షులు గాజుల సోమేశ్వరరెడ్డి తెలిపారు. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో డిసెంబరు 12,13 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీలలో సత్యసాయి జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరచి జాతీయస్థాయికి ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ధర్మవరం జిల్లాపరిషత్ బాలికల పాఠశాలనుంచి ఏడుగురు, ముదిగుబ్బ బాలికల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల నుంచి నలుగురు, లేపాక్షి కస్తూర్బాపాఠశాల, మోడల్ స్కూల్ నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరు తమిళనాడులోని దిండిగల్లో ఈ నెల 27,28తేదీల్లో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులకు గాజులసోమేశ్వరరెడ్డితోపాటు అసోషియేషన్ జిల్లా సెక్రటరీ సుబ్బరాయుడు, ఆర్గనైజర్ నరసింహులు, కమిటీసభ్యులు అభినందించారు.

భూకబ్జాలపై చర్చకు సవాల్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

కరోనా సమయంలో మండలంలోని తుంపర్తి ఎర్రగుంట భూముల కబ్జా జోలికి వచ్చింది వాస్తవం కాదా అని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల వర్గీయులు తుంపర్తి పరమేశ్, గొట్లూరు చంద్ర తదితరులు ప్రశ్నించారు. ఈ మేరకు గోనుగుంట్ల వ్యక్తిగత కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో పరమేశ్, చంద్రలతోపాటు నారాయణస్వామి, దేవంద్రనాథ్ రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ భూముల కబ్జా విషయంలో కోర్టులో కేసులు వేసి ఆ భూములను కాపాడింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వీటిపై చర్చకు సిద్ధమా అని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డికి సవాల్ విసిరారు. నియోజకవర్గంలో తరచూ అబివద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న ఆయన ముదిగుబ్బ వద్ద జాతీయ రహదారి పనులు ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. తమ నాయకుడు గోనుగుంట్ల తన సొంతఖర్చులతో రోడ్లు బాగుచేస్తుంటే వాటిని అడ్డుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ సమావేశంలో గోనుగుంట్ల అనుచరులు దుస్సాక్రిష్ణ, బోడగలగిరిధర్, చిలకం సూర్యనారాయణరెడ్డి, రాప్తాటి రాము, నబీరసూల్, రాజశేఖరెడ్డి, గంధమనేని నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న రైతుల కష్టాలు : ఎమ్మెల్యే


పాదయాత్రలో పాల్గొన్న, ఎమ్మెల్యే, నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి నియోజకవర్గ రైతుల కష్టాలు త్వరలో తీరనున్నాయని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన చేపట్టిన డాక్టర్ వైయస్సార్ రైతు విజయ సంకల్పయాత్ర ఏడవ రోజు పుట్టపర్తి మండలంలోని నిడిమామిడి, కొత్త నిడిమామిడి, ఇరగరాజు పల్లి గ్రామాల్లో సాగింది .ఈ సందర్భంగా ఇరగ రాజు పల్లి గ్రామంలో వరి పొలాల్లో పనులు చేస్తున్న మహిళా రైతులతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిడిమామిడి స్థానిక నాయకులు, బాబు , వైస్ ఎంపీపీ, రామచంద్రారెడ్డి, నంజి రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, కొట్లపల్లి సర్పంచ్, ఇరగరాజు పల్లి సర్పంచి వెంకట రెడ్డి, వైసిపి ఎస్టీ సెల్ అధ్యక్షులు తిరుపాల్ నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : రైతు సంక్షేమమే వైసీపీ ప్రభుత్వం ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి ,జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ అన్నారు. వైఎస్ఆర్ విజయసంకల్ప యాత్రలో భాగంగా ఏడవ రోజు కొత్తచెరువు మండలంలోని చెన్నంరాజుపల్లికి గురువారం చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోనే 193 చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా నింపి రైతుల పంటలు సాగు చేసుకోవడానికి వదలడం జరుగుతుందన్నారు. ఇందుకు ప్రభుత్వం రూ. 860 కోట్లు మంజూరు చేసిందని ఈ పనులు కూడా త్వరగా పూర్తి చేస్తామని అన్నారు. మండలంలో 2 వేల మందికి ఇళ్ల పట్టాలు, గృహాలు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీపీ గాయత్రి, రెడ్డప్ప రెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి, సర్పంచులు గీతాబాయి, రత్నమ్మ, ప్రకాష్, వైసీపీ నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, నాగభూషణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

వైసిపి అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : పల్లె


సమావేశంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

వైసిపి ప్రభుత్వం, ఆపార్టీ నాయకులు చేస్తున్న అరాచకాలు దౌర్జన్యాలు గురించి ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణకు సంబంధించి సిబ్బంది మాట్లాడుతూ సాంకేతిక విధానం పార్టీ ప్రతిష్టకు ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలియజేశారు. మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ శిక్షణ ద్వారా అనేక ఫలితాలు పొందబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఎస్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మనోహర్ నాయుడు, పోల్ మేనేజ్మెంట్ పార్లమెంట్ కోఆర్డినేటర్ వెంకటరమణ, ఐటిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు రామాంజనేయులు, పార్టీ పరిశీలకులు బచ్చలి పుల్లయ్య, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు మహమ్మద్ రఫీ, పుల్లప్ప, దయ్యాల ఉమాపతి, నాయకులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : స్థానిక ఐటిఐ కళాశాలలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రైనింగ్ సిబ్బంది మాట్లాడుతూ సాంకేతిక విధానం పార్టీ ప్రతిష్టకు ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలియజేశారు. టీడీపీ యాప్ ఉపయోగించి ఎంతటి చిన్న సమస్యనైనా త్వరిత గతిన పార్టీలోని అగ్ర నాయకులకు చేరే విధంగా సమస్యలతో పాటు ఆలోచనలో కూడా పంచుకోవడానికి వీలుగా ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకొని పార్టీ పటిష్టతకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఎస్ పార్లమెంటు కొర్డినేటర్ మనోహర్ నాయుడు, పోల్ మేనేజ్మెంట్ పార్లమెంట్ కోఆర్డినేటర్ వెంకటరమణ, ఐడీటీపీ పార్లమెంటు అధ్యక్షులు రామంజనేయులు, మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పిటిసి పిట్ట ఓబుల్ రెడ్డి, బూదిలి ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె బాటలో డిఆర్‌డిఎ ఉద్యోగులు

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

జిల్లాలోని డిఆర్‌డిఎ, వైకెపి, సెర్ప్ ఉద్యోగులు సమ్మె బాటలోకి వెళ్లనున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక డిఆర్‌ఒ కొండయ్యకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. లేనిపక్షంలో సమ్మెబాట పట్టడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. వాస్తవానికి గురువారం నుంచే సమ్మె చేపడుతున్నట్లు బుధవారం ప్రకటించామని కొన్ని అనివార్య కారణాలవల్ల మరొకసారి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించి తమ సమ్మెపై చర్చించుకుని తదుపరి కార్యాచరణ ప్రకటించనున్నామని చెప్పారు. ఈకార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రామేశ్వర్ రెడ్డి, కో కన్వీనర్లు రామ్మోహన్, శంకర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఏక్రీడల్లోనైనా గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని ఆత్మీయట్రస్టు వైస్‌చైర్మన్ శెట్టిపి సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో గురువారం ధర్మాంబ బాస్కెట్బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయట్రస్టు, సహకారంతో నిర్వహిస్తున్న అండర్-14 ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో భాగంగా రెండవ రోజు శెట్టిపి సూర్యప్రకాశ్ రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, అసోషియేషన్ పట్టణ అధ్యక్షులు మేడాపురంరామిరెడ్డి, కోచ్ సంజయ్, అనంతపురం జిల్లా కోచ్‌లు నరేంద్ర, లత తదితరులు పాల్గొన్నారు.

ఆసరా కాదు.. టోకరా : కందికుంట

ప్రజాశక్తి, కదిరి టౌన్

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అక్కాచెల్లెలమ్మ కు ఆసరా అందజేశామని గొప్పలు చెపుతున్నారని అది ఆసరా కాదు టోకరా అని కందికుంట ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు బటన్ బొక్కి ఆసరా డబ్బులు జమ చేశామనిచిలక పలుకులు పలికిన జగన్ చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన లేదని విమర్శించారు. ఇచ్చేది గోరంత...దోచేది కొండంత అని ఆరోపించారు. మద్యం రేట్లు మూడు రెట్లు పెంచారన్నారు. నాశిరకం మద్యంతో 35 లక్షలమంది ఆరోగ్యాలు నాశనం చేశారని విమర్శించారు. సెంటు పట్టాలో ఇళ్ల నిర్మాణం పేరుతో మహిళలను అప్పులపాలు చేశారన్నారు. దేశవ్యాప్తంగా మహిళలపై జరిగే నేరాల్లో 3వ వంతు ఆంధ్రప్రదేశ్ లోనే జరుగుతున్నాయన్నారు.

వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 28న చేపట్టిన ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, మాజీ పిసిసి అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్ అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీ సత్య సాయి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయనతోపాటు పిసిసి ఉపాధ్యక్షులు కేటీ శ్రీధర్, పిసిసి జనరల్ సెక్రెటరీ బాలాజీ మనోహర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి కాలువ హరిత, షానవాజ్, శ్యామ్ కిరణ్, జమీల్ అమానుల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత రాయలసీమగడ్డకు చెంఇన ముగ్గురు పీసీసీ అధ్యక్షులుగా పదవులు పొందడం గర్వించదగిన విషయం అన్నారు. సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు సారథ్యంలో పిసిసి అధ్యక్షురాలు షర్మిలమ్మ చేపట్టిన పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నను హతమార్చిన తమ్ముడు

తనకల్లు : మండలంలోని మలిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో నడిమికుంట్లపల్లిలో అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో తమ్ముడు తన అన్నను హతమార్చాడు. పోలీసులు తెలిపిన వివరాలు... బుధవారం రాత్రి గ్రామానికి చెందిన అన్నదమ్ములు సంజీవు, వెంకటేష్ మద్యం తాగారు. అనంతరం చేపల కూర వండే విషయంలో వారి మధ్య గొడవ మొదలైంది. గొడవ కాస్తా ఘర్షణకు దారితీసింది. ఈ నేపథ్యంలో వెంకటేష్ తన అన్న సంజీవును తలపై కట్టెతో బలంగా కొట్టాడు. ఈ దెబ్బకు సంజీవు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని మేనత్త నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ధర్మవరం టౌన్ : ధర్మవరం రైల్వేస్టేషన్ పరిధిలో సోలాపూర్‌ఎక్స్ ప్రెస్ రైలుకింద ఓ గుర్తుతెలియనివ్యక్తి పడి ఆత్మహత్య చేసుకున్నట్టు రైల్వేజీఆర్పీ ఎస్ఐ గోపీకుమార్ తెలిపారు. మృతునికి 45-50 సంవత్సరాల మధ్యవయస్సు ఉంటుందని, స్కైబ్లూరంగు షర్టు, బ్లాకలర్, ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడని అన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కర్నాటక మద్యం తరలిస్తున్న వాహనంలో కార్యదర్శి

చిలమత్తూరు : కర్నాటక నుండి జాతీయ రహదారిపై కర్నాటకకు చెందిన 6 బీర్లు, విందుభోజనంతో వస్తున్న వోమిని వాహనాన్ని కొడికొండ చెక్‌పోస్టు వద్ద సెబ్ పోలీసులు పట్టుకున్నారు. ఇందులో చిలమత్తూరు పంచాయతీకి చెందిన కార్యదర్శి ఉన్నారు.అయితే కార్యదర్శి ఆ వాహనంలో బీర్లు ఉన్న విషయం తనకు తెలియదని చెబుతున్నారు. ఈ వాహనం చిలమత్తూరుకి చెందిన వ్యక్తులది, ఉన్నతాధికారుల కోసం బాగేపల్లి నుండి భోజనం తీసుకెళు తున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. వోమినీ వాహనాన్ని సెబ్ పోలీసులు చిలమత్తూరు స్టేషన్ కు తరలించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నల్లచెరువు : మండల పరిధిలోని దామవాండ్ల పల్లికి చెందిన వైసిపి నాయకుడు ఆదినారాయణరెడ్డి గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి, సర్పంచి యూసుఫ్, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

చెక్కులను దహనం చేసిన ట్రెజరీ అధికారులు

కొత్తచెరువు : ప్రభుత్వం సిఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులను చెల్లిస్తున్నందున ట్రెజరీలలో పేరుకొని పోయిన పాత చెక్కులను కొత్తచెరువు సబ్ ట్రెజరీ ఆవరణంలో తహశీల్దార్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖలఅధికారులు సబ్ ట్రెజరీ అధికారులు దహనం చేశారు. సత్యసాయి జిల్లాలోని ఏడు ట్రెజరీల పరిధిలో 7011 చెక్కు బుక్కులను కాల్చివేశారు. జిల్లా అధికారి నాగమణి మాట్లాడుతూ ఈ చెక్కులు పనికి రాకుండా పోయినందున ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని కాల్చివేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

క్రీడాకారులకు ప్రోత్సాహం

బత్తలపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని శ్రీజ్యోతి హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మిడతల లక్ష్మీనారాయణ, స్కూల్ డైరెక్టర్ యం. ధర్మతేజ పేర్కొన్నారు. నియోజకవర్గస్థాయిలో ఈ నెల 24, 25వ తేదీల్లో క్రీడా పోటీలను నిర్వహించారు. అందులో శ్రీజ్యోతి హై స్కూల్ విద్యార్థులు ఖోఖో బాలికల విభాగంలో గెలుపొంది, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో క్రీడారులను అభినందిన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగపెద్దిరాజు, కాటమయ్య. రమేష్, శంకరయ్య, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలో సంతృప్తి

ధర్మవరం టౌన్ : పేదలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి కలుగుతుందనిపరమిత పీఠాధిపతి వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీయోగి ముక్తేశ్వరీ మాతాజీ పేర్కొన్నారు. స్థానిక సిద్ధయ్యగుట్టలోని శ్రీశ్రీశ్రీపరమపిత వెం కటరమణాచార్య గురువు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం 12వ ఆరాధనోత్సవాల సంధర్భంగా ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లను మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీచేతులమీదుగా పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయరాంరెడ్డి, వైసిపి నాయకులు చాంద్‌బాషా, ట్రస్టు వైస్‌ఛైర్మన్ ఆశోక్‌కుమార్,కార్యదర్శి రామాంజనేయచారి, ఉపకార్యదర్శి మల్లికార్జున, కోశాధికారి నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్న అమడుగురు జనసేన పార్టీ మండల కన్వీనర్ ఆంజనేయులుకు జనసేన పార్టీ నాయకులు, బ్లూమూన్ విద్యా సంస్థల చైర్మన్ మంచి శివశంకర్ ఆర్థికసాయం చేశారు. ఈ మేరకు ఆయన ఆసుపత్రికి వెళ్లి భాదితుడి పరామర్శించి రూ. 30వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కదిరి ఇన్‌ఛార్జి బైరవ ప్రసాద్, గవ్వల శ్రీనివాసులు చెన్నప్ప రెడ్డి, శంకర తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రజలకు ఇచ్చిన ఆయుధం : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఇచ్చిన ఆయుధం అని రాబోవు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక పరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి మంగళవారం పోలీసు అధికారులు, సిబ్బందిచేత ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఓటు ద్వారా మంచి పాలన వర్గాన్ని నిర్ణయించుకునే అధికారం ప్రజలకు రాజ్యాంగం కల్పించిందన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్ విష్ణు, ఎఆర్ డీఎస్పీ జడ్ విజయ్ కుమార్, ఏవో సుజాత, సిసి రాఘవేంద్ర, ఆర్ఐలు రాజశేఖర్ రెడ్డి, టైటాస్, నారాయణ జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : యువతీయువకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఓటుహక్కును పొంది ఓటు అనే ఆయుధంతో సరైన నాయకుడిని ఎన్నుకోవలని ఆర్డీవో రమేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

కొత్తచెరువు : డీఈవో కార్యాలయంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని డీఈవో మీనాక్షి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్క పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీలు నాగరాజు, రామకృష్ణ, జిల్లా వత్తి విద్యల కోఆర్డినేటర్ లాజర్ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : ఓటు అనే ఆయుధంతో మంచి పాలకులను ఎన్నుకునే అవకాశం ఓటర్లకు ఉంటుందని ఆర్డీవో వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీలత పేర్కొన్నారు బుధవారం స్థానిక బాలికల పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, తహశీల్దార్ సునీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుస్మిత, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రశాంత్, రెవిన్యూ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలో 12వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం పట్టణంలో పలు కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ మండలం బిట్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఎస్‌డిజిఎస్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పిఒలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

గాండ్లపెంట : అంతర్జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు తహశీల్దార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హమీద్‌బాషా, ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ ఆలీ, వీఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రఫీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మరో ముగ్గురు అధికారులపై వేటు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి జరిగిన అవినీతి అక్రమాలలో మరో ముగ్గురు రెవిన్యూ సిబ్బందిపై వేటు పడింది. ఇప్పటికే బత్తలపల్లి తహశీల్దార్ యుగేశ్వరిదేవి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అక్రమాలపై లోతుగా విచారణ చేసిన అధికారులు ఇద్దరు వీఆర్వోలు, ఒక వీఆర్ పాత్ర ఉందని తేలడంతో వారిని సస్పెండ్ చేసినట్టు తెలిసింది. సస్పెండ్అయిన వారిలో గొట్లూరు వీఆర్వో నజీర్, పోతుకుంట వీఆర్వో వెంకట్రామిరెడ్డి, కట్టకిందపల్లి వీఆర్ఎ నారాయణస్వామి ఉన్నట్టు రెవిన్యూ వర్గాల ద్వారా తెలిసింది. పోతుకుంట వీఆర్వోగా ఉన్నవెంకటరామిరెడ్డి కుణుతూరు ఇన్చార్జ్ ఉంటూ పోతుకుంట, కుణుతూరులో ఇళ్లపట్టాలు, భూపంపిణీ,మ్యూటేషన్లో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేసినట్టు తెలిసింది.అదేవిధంగా గొట్లూరు వీఆర్వోగా ఉన్న నజీర్ ధర్మవరం పట్టణ ఇన్‌ఛార్జి విఆర్వోగా ఉంటూ బారీ అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందడంతో ఆయనకు కూడా సస్పెండ్ చేసినట్లు తెలిసింది. వీరికి సహకరించిన కట్టకిందపల్లి వీఆర్ఎ నారాయణస్వామిని కూడా సస్పెండ్ చేసినట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ విషయంపై ఆర్డీవో రమేశడ్డిని వివరణ కోరగా సస్పెన్షన్ ఉత్తర్వులు అందాయే కానీ తానుమీటింగ్లో ఉండటం వల్ల వాటిని చదవలేదని పరిశీలించి తెలుపుతానని సమాధానం ఇచ్చారు.